



తలుపు తడుతున్న శబ్దమయేసరికి సరస్వతమ్మ గారు—"చూడవే తల్లీ! అల్లుడు వచ్చినట్లున్నాడు. తలుపు తెరువు" అంది.

"తలుపు దగ్గర కొంచెం ఆగినంత మాత్రాన మీ అల్లుడు అలసి పోడులే" అని నవ్వుతూ తలుపులు తెరవడానికి వెళ్ళింది ఇందిరా దేవి.

కుడి కన్ను అదురుతూ ఉంటే పైట కొంగుతో తుడుచుకుంది. సోఫా మోకాలు చిప్పకి తగిలి నరం జివ్వుమని లాగింది. కాలును చేత్తో రాస్తూ వెళ్ళి తలుపు తీసింది. శేఖరు తూలి ఆమె భుజం మీదకు వంగి గుమ్మం వూత చేసుకుని నిలదొక్కుకున్నాడు.

"ఏందేవీ! భర్తన్ని చూసి భయపడు తున్నావా. వో. మైకం కమ్మిందే తప్ప మతి పోలేదు" ఆమె భుజాల్ని కుదుపుతూ అన్నాడు.

అతను మాట్లాడే తీరు, అతని దగ్గర ఏదో ఆమెకు పరిచయం లేని దుర్వాసన ఆమెలో శక్తి నంతా లాగేసినట్టయి సోఫాలో కూలబడి పోయింది.

"ఏమే—ఎంతకీ రావు?" సరస్వతమ్మగారు హాల్లోకి వచ్చారు.

"నమస్కారం అత్తగారు! వూరకే రారు అత్తలు. అంతా బాగున్నారా! మీ అమ్మాయి షాకుతింది. కొంత సేపు పోతే కాని తేరుకోదు" అని వంకర్లు తిరిగి పోతూ, జోగుతూ—తూగుతూ లోపలికి నడవ బోయాడు. అల్లుడంటే అమితమైన అభిమానం, గౌరవం ఉన్న సరస్వతమ్మగారు అల్లుడు గుజ్జి మెక్కిన సంగతి గ్రహించి మొదట ఆశ్చర్యం, కొన్ని క్షణాల తరవాత కోపం వెనువెంటనే బాధ ఆఖరిగా అసహ్యం వేసి ఉన్న చనువును ఆసరాగా తీసుకుని—

"ఏవయ్యా! ఈ దౌర్భాగ్యపు పని ఎప్పటినుంచి మొదలెట్టావు? బుద్ధిమంతుడ వని—మంచి ఉద్యోగస్తుడ వని పిల్లనిచ్చాం కాని ఇలా తాగి తందనాలాడతావని కలలోకూడా అనుకో లేదు. ఒక్కసారి ఆ పుణ్యాత్ములు మీ అమ్మ నాన్నల్ని తలుచుకుని నువ్వు చేసిన పనికి సిగ్గుపడు. అమ్మాయిని పువ్వుల్లో పెట్టి పెంచాం. నువ్విలా తయారయితే అది గుండె పగిలి చచ్చి పోతుంది." ఆమె గొంతులో కోపం కన్న ఆవేదనే ఎక్కువగా ఉంది.

"అమ్మా! నువ్వు లోపలి కెళ్ళమ్మా." అంది దేవి కన్నీటిని పమిటకొంగుతో తుడుచుకుంటూ.

మతి పోయిన దానిలా ఎంత సేపు కూర్చుందో సోఫాలో—లేచి పడక గదిలోకి వెళ్ళింది. శేఖరం బట్టలు మార్చుకుని పడుకుందికి పక్క మీద ఒరగ పోతున్నాడు.

"అదేం టండీ. భోజనం చెయ్యరా!" ఆందోళనగా అంది, రాత్రి ఎనిమిది గంటలకి భోజనం చేస్తే పది గంటలకి "ఆక లవుతుంది, తిండాని కేముంది" అనే అలవాటున్న శేఖరాన్ని.

"చేసేశాను. మీ అమ్మగారు వచ్చారుగా! ఆవిడ సపర్యలు చెయ్యి. తల్లి ఋణం తీర్చు కోలేనిది. మొగుడు మధ్యలో వచ్చిన వాడు." ముద్దుగా వస్తున్న మాటలు, చాలా దూకుడుగా అన్నాడు.

"ఏమిటండీ ఆ మాటలు. మీలో ఎంత మార్పొచ్చిం దండీ." మెల్లగా అంది— పక్క గదిలో ఉన్న తల్లికి మాటలు ఎక్కడ వినిపిస్తాయో అన్న భయంతో.

"ఆపేస్తే ఆగేది కాదే మార్పు. అది వస్తుంది. నీకు పుస్తె కట్టేప్పుడు నిన్ను భరిస్తా నని వాగ్దానం చేశాను కాని, మారకుండా మీ అందరికీ నచ్చే విధంగా మసులుకుంటానని మాటివ్వ లేదుగా. ఒక్కసారి బయటి కెళ్ళి చూడు. బెల్‌బాటమ్స్, స్లీవ్‌లెస్లు, కళ్ళకి చలవద్దాలు, వుమన్ లిబ్, ఆడ క్లబ్బులు— కోక్లబ్బులు ఫాషన్ అయినట్లే—తాగడం ఫాషన్, చాలా మందికి ఫాషన్. ఆ మధ్య మందు కోసం ఢిల్లీ షాపుల ముందు ఆడా, మగా బార్లు తీరి నిలుచున్నా రట "బీరు" కాయల కోసం. నన్ను ఎప్పటిలా పక్కపాడి కూడా నవ్వులని చవటలా ఉండమనా నీ ఉద్దేశ్యం. ఉండను. చస్తే ఉండను. తాగుడు గురించి తాగే వాడ్నడుగు. మొరార్జీ భాయిని మీ అమ్మగార్ని అడిగితే ఏం లాభం. . ."

తలుపు వారగా నిలబడి అల్లుడి అఘాయిత్యపు మాటలు వింటున్న మహాలక్ష్మమ్మగారికి పై ప్రాణాలు పైనే పోయాయి. మిలటరీలో ఉన్న చిన్న కొడుకు వ్యవహారం గుర్తుకొచ్చింది. అయితే వాళ్ళ కది లేందే గడవ దనలు. ఇన్సూరెన్స్ ఆఫీసులో పని చేస్తున్న అల్లుడికేం తెగులు? "అయినా రోజులు మారి పోతున్నాయి. పిల్లలు చెప్పినట్లు పెద్దలు వినాలిసిందే". అనుభవం ఇచ్చిన భరోసాతో పోయి పడుకున్నా రావిడ.

దేవికి ఆ రాత్రి శివరాత్రే అయింది.

## 2

"దేవిగారూ. దేవీ. . ." శేఖరం కేకతో వంటింటి నుంచి పరుగు లాంటి నడకతో వచ్చింది.





స్థాపితం: 1957 ఫోన్ నెం. 846188

మీరు మీ ఇంటియందుండే తపాల పాఠములద్వారా చిత్రకళ నేర్చుకొని రెండు సంవత్సరములలో ఉత్తమ చిత్రకారులు కావచ్చును.

యావద్భారత దేశము నుండియు, విదేశములనుండియు అనేక మంది మన విద్యాలయములో విద్యార్థులుగా చేరి ఉత్సాహముతో శిక్షణ పొందుచున్నారు.

మీరు కూడా ఈ సులభ పద్ధతులతో చిత్రకళ నభ్యసించుటకు సమ్మతించుచున్నారా? వివరముల కొరకు తొమ్మిది నది పైసల స్టాంపులను పంపండి.

**SANTHANU's CHITIRA VIDYALAYAM,**
C/o CHITIBAKULLAN, 179, Singanna Chetty Street,
Chintadripet, Madras - 600 002.

Arjee

# వినికిడి సమస్యా



ఉచిత సలహాకు మరియు మీ చెవుడు యొక్క రకాన్ని బట్టి అమర్చబడగల సరికొత్త అర్పి—ఆటికన్ (ట్రాన్సిస్టరైజ్డ్) వినికిడి సాధనముల ఉచిత పరీక్షకు దయచేసి మా హియరింగ్ ఎయిడ్ కన్సల్టెంటుని చూడండి. వివిధ రకాల వినికిడి సాధనములు కలవు. ఆడియో మీటర్ పరీక్ష హియరింగ్ ఎయిడ్‌ను కొనువారికి మాత్రమే ఉచితము. మీ ఆర్డరును మీరు ఆయన ద్వారా బుక్ చేసుకొనవచ్చును.

సంప్రదింపు వేళలు:— ఉ. 9 గం. నుంచి మ. 1 గం. వరకు } హోటళ్ళ వద్ద
మ. 2 గం. నుంచి సా. 6 గం. వరకు }

(డీలర్ల ఆవరణల వద్ద సంప్రదింపు డీలర్ల పని వేళల ప్రకారము)
ప్రతి చోటా చివరి రోజున మ. 1 గం. వరకు మాత్రమే.

| | | |
|---|---|---|
| తిరుపతి | భీమాస్ లాడ్జి ఎనెక్స్, రైల్వేస్టేషన్ దగ్గర | నవంబరు 10, 11 |
| కడప | హోటల్ ప్రతాప్, రైల్వేస్టేషన్ రోడ్డు | నవంబరు 12, 13 |
| అనంతపురం | హోటల్ సప్తగిరి, సుభాష్ రోడ్డు | నవంబరు 14, 15 |
| కర్నూలు | వెంకటేశ్వర హోటల్, బస్సుస్టాండు దగ్గర, ఫోర్టు | నవంబరు 16 |
| హైదరాబాద్ | కేరాఫ్ శ్రీ టి. కుంజు, 5—8—50/2, ఫతే సుల్తాన్ సందు, నాంపల్లి స్టేషన్ రోడ్డు | నవంబరు 18 (సా. 6 గం. వరకు) |
| హైదరాబాద్ | బృందావన్ హోటల్, నాంపల్లి స్టేషన్ రోడ్డు | నవంబరు 19, 20 |

**DEAF AID CENTRE (India)**
2/5, Sivagnanam Road, Pondy Bazaar,
T. Nagar, Madras-600 017. — Phone : 440575.
H.O. Post Box No. 9122, Bombay - 400 025.


"ఏం. పిలిచిన వెంటనే రావాలని తెలీదా? నీకు పొగ రెక్కువయ్యిందే. అందులో మీ అమ్మగారు ఉన్నారుగా. నేను కనిపించను. నామాట వినిపించదు" పక్క మీంచి లేవకుండానే వాల్యూమ్ అసాధారణంగా పెంచి "గుడ్ మార్నింగ్" చెప్పినట్టుంది శేఖరం తంతు.

"అంత గట్టిగా మాట్లాడకండి. పక్కింటి వాళ్ళకి వినిపిస్తుంది. మీ ధోరణి చూసి అమ్మ తెల్లారుజాము ట్రెయిన్‌కే వెళ్ళిపోయింది" అంది సిగ్గుతో కుంచించుకు పోతూ.

"మరి చెప్పవేం ఆ సంగతి. రా రా అబ్బ. కిందటి సారి నువ్వు పురిటి కెళ్ళినప్పుడు నేను పడ్డ వేదనా, విరహం— ఇబ్బంది. . . తలుచుకుంటే జీవితం మీద విరక్తి కలుగుతోంది. ఏమైనా సరే ఈ సారి నీ పురుడు ఇక్కడే, నా చేతుల మీదు . . ."

"ఛీ— ఏంటండీ ఆ మాటలు. మీ పనియను మీరు ఉతుక్కో లేరు కాని. . ."

ఎమర్జన్సీ వాతావరణం పోయి, జనతా వాతావరణం వచ్చింది.

"అవును. తెలియదు కడుగుతాను. నిన్నాదిలి నేనొక్క రోజు ఉండలేను కదా. నెలల తరబడి నన్నొదిలుండగలిగే కటినత్వం నీకో ఎక్కడుంది?" దగ్గరకు తీసుకుని పొట్ట నిమురుతూ ఎప్పటిలా అమాయకంగా, ఆప్యాయత నిండిన గొంతుతో అన్న శేఖర్ మాటలు రాత్రి జరిగింది పీడ కలా అనిపించేట్టు చేశాయి.

"ఏమండీ. రాత్రి. . ." అతని భుజం మీద తల ఆనిస్తూ ఏదో అడగబోయింది.

కొంత సేపు నవ్వాడు. ఆమెను మరీ మరీ అదుముకుంటూ నవ్వాడు. భుజం మీంచి తల తీసి దేవి అతని ముఖంలోకి చూసింది. నవ్వు నించి ఎరుపెక్కింది, కళ్ళల్లో చెమ్మదనం. "తనకు తెలిసిన శేఖరం" అనుకుంది. మూడేళ్ళ నుండి ఆమెను మురిపించి అలరిస్తున్న ముఖం. ఆప్యాయత చిందించే ముఖం. అలిగి కావాలిసిన వన్నీ సాధిస్తున్న ముఖం. ఎప్పటిదో ముచ్చట గుర్తుకు వచ్చి వస్తున్న నవ్వు నాపుకుందికి పెదాలని పళ్ళతో కొరుకుతూ కొత్త పెళ్ళి కూతురిలా తల దించుకుంది.

"కిందటి సారి పురిటికి నిన్ను అయిదో నెలలో తీసుకు పోతే కొత్త — మొహమాటం కాదన లేక పోయాను. జూనియర్ వస్తాడన్న సంతోషం కన్నా ఒంటరి తనపు బాధే ఎక్కువయింది. వెర్రెత్తి పోయినట్టయి నిన్ను తిట్టడానికి నోరు రాక, మీవాళ్ళని తిట్టడం అన్‌ఫెయిర్ అనిపించి, కనిపించని భోలా శంకరున్ని తిట్టాను. భక్తుల కన్నా తిట్టే వాళ్ళంటే వేగంగా ఆదుకునేందుకు వస్తాడట దేముడు. ముద్దొచ్చే బాబిగాణ్ణి ఎత్తుకొని కొత్త మెరుపుతో వసంతంలా నడిచి వచ్చావు. ఈ సారి నువ్వు, బాబు కూడా వెళితే ఆ భోలాశంకరుడు కూడా చూసన్నుకాపాడలేడు. అందుకే నిన్న రాత్రి నాటకం, ఏకపాత్రాభినయం. . ."

"మరి ఆ వాసన. . ." నోరు తెరుచుకుని ఆశ్చర్యంగా చూస్తూ అంది.

" "డుంబు" గాడని చెబుతుంటానే డాక్టర్ ఫ్రెండ్ ఆనందరావు వాడి చలవ. ఏదో ద్రవ పదార్థం ఒక మోతా దిచ్చాడు. "ఒరే. నువ్వేని

తినకుండా ఉంటే ఈ మందు వాసన తెల్లారేదాకా నిన్నొదలదు" అన్నాడు. వాడికి నాటకాలన్నా హాస్య రచనలన్నా తెగ పిచ్చి. ఎంత వెకిలిగా రాస్తాడో మనసంత మంచిది. నా సమస్య చెప్పిన వెంటనే కొండెక్కినంత సతోషంతో "సినేరియా" రాసిచ్చాడు అదే ఏం మాట్లాడాలో అదీను. ఎప్పుడు నిన్ను పుటింటికి పంపించాలన్న సంగతి గురించికూడా డాక్టర్‌గా సలహా ఇచ్చాడు" అని ఒళ్ళో తల పెట్టుకుంటూ ఆఖరి వాక్యం ఆదోలా అన్నాడు శేఖరం.

భర్త చెడిపోలే దని పూర్తిగానమ్మకంకుదిరిన దేవి అతని తలని ఒళ్ళోంచి తీసి లేచి నిలబడింది.

"మీ నటనకి నా బహుమతిగా మిమ్మల్ని భోజనం నించి పరుగులు పెట్టించే అరటికాయ వేపుడు చేస్తాను. కాని మా అమ్మ వస్తున్న విషయం మీ కెలా తెలిసింది. అమ్మేం ఉత్తరం వ్రాయలేదే" అంది అతన్ని నిలదీస్తూ.

"ఎలి మెంటరీ మై డియర్ వాట్సన్. తెలుగు కేలండరు టచ్‌లో ఉంటే మీ అమ్మగారి ప్రోగ్రామ్ అన్నీ తెలిసి పోతాయి" అన్నాడు, ఆమె నిర్దాక్షిణ్యంగా ఒడిలోంచి తీసేసిన తల తడుముకుంటూ.

"నా పేరు వాట్సన్ కాదు. పోయి ముఖం కడుక్కోండి.కాఫీ ఇస్తాను. అమ్మకి వెంటనే ఉత్తరం వ్రాయాలి. అక్కడ నాన్నని ఏం ఇబ్బందులు పెడుతూందో" ఆలోచిస్తూ వంటింట్లోనికివెళ్ళి పోయింది రుసరుస లాడుతూ.

గోటితో పోయే దానికి గొడ్డలి ఉపయోగించాడా అనిపించినా దేవి పుట్టింటి ప్రయాణం తప్పించి నందుకు ఉషారుగా "శివరంజనీ, నవరంజనీ" పాడు కుంటూ బాత్‌రూమ్ కేసి నడిచాడు శేఖరం.

స్నానం చేసి వంటింట్లోకి వెళ్ళేసరికి టిఫిన్, కాఫీ రడీగా ఉంచింది దేవి. స్వీట్ హోమ్ తతంగ మంతా ఎప్పటి లానే మొదలయింది.


"నిన్న రాత్రి నీ మనసు కష్ట పెట్టినందుకు పరిహారం ఏం చెల్లించాలో చెప్పు?" న్యూస్ పేపరు పక్కన పెడుతూ వంట పూర్తి చేసి వచ్చిన దేవి నడిగాడు శేఖరం. ఆమె మనసు పీను అనవసరంగా కష్ట పెట్టినందుకు అతని మనసు కుతహాంది. మరపుకు రావడం లేదు.

ఆ మాటల్ని విన్న దేవి అతని దగ్గరకు వచ్చి ఆప్యాయంగా మెడ మీద వేసిన చేతుల చల్లదనం, చూసిన చూపు చాలు శేఖరానికి, తనెంత అదృష్ట వంతుడో తెలుసుకుందికి. పెళ్ళయిన తరవాత తానుగా సృష్టించిన పీడ కల కరిగి స్వర్గం కనిపించి నట్టయిం దతనికి.

"అందుకే నండీ. నిన్న రాత్రి నేను ఆందోళన చెందింది, నిద్ర లేకుండా బాధ పడిందీను. ఇతరుల మనసుల నొప్పించడం చాత కాని మీరు నన్ను నొప్పించే అటువంటి పని చేశారంటే మీ మనసు తెలుసు ననుకున్న నేను ఏమై పోవాలి? ఇక మీ రెప్పుడూ హాస్యానికికూడా అటువంటి పని చెయకండి." అనునయిస్తున్నట్టుగా చంటి పిల్లాడికి ఏం కావాలో తెలియక చేసే అల్లరిని మానిపించే ధోరణిలో బుజ్జగింపుగా ఉంది. అతని మనస్తత్వానికి సరిపోయేదే ఆమె లాలన.

పెళ్ళయిన కొత్తలో జరిగిన సంఘటన ఆమెకు గుర్తొచ్చింది. అప్పుడు శేఖరం స్వంత వూరు లోనే ఉద్యోగం అవడంతో కొత్త కాపరం పెద్ద వాళ్ళ అండలోనే ప్రారంభమయింది. యువ దంపతులు పెళ్ళయిన కొత్తలో పెద్ద వాళ్ళతో ఉండటమే ఆరోగ్య దాయక మని, దీర్ఘ కాల వైవాహికసుఖ జీవనానికి గట్టి పునాది పడుతుందని లక్ష్మమ్మ గారు ప్రతిపాదిస్తే అందుకు శేఖరం తండ్రి దశరథ రామయ్య వంత పాడారు. లక్ష్మమ్మగారి మనసు మంచిదే కాని నోటి జోరు ఎక్కువ.

ఒకసారి సరస్వతమ్మగారు వంటింటి బాధ్యత కోడలుకు అప్ప జెప్పి పై వూరుకు వెళ్ళారు. ఆ వూరులో ఉండేది రెండు రోజులే. అయితే ఆ రెండు రోజుల్లో వంటింటి స్వరూపమే మారిపోయింది. వంటింటి మేనేజ్‌మెంట్ కొత్తవడంతో దేవి మిస్ మేనేజ్ చేసేసింది. ఆవకాయ జాడీకి మంచి నీళ్ళు తిన్నెకు ఉండాల్సిన దూరం తగ్గిపోయింది. వంట కుంపట్లుకు, దేవుని నిలయానికి మధ్య ఉన్నది అన్నం గిన్నె మాత్రమే. మడి బట్టలు ఆరేసే తీగమీద ఇల్లు తుడిచే గుడ్డ. . . ఇలా మడి మంట కలిపేసింది, ఆచారాలన్నీ బుగ్గి పాలయ్యాయి. గుంటూరు మిరపకాయ పొరపాటున నమిలేసి నట్టు, నిప్పుల్ని తొక్కినట్టు జువ్వన లేచి తారా స్థాయిలో అందుకున్నారు లక్ష్మమ్మగారు అక్షింతలు వెయ్యడం. అదిరి పోయింది దేవి. బెంబేలు పడిపోయి నోరెత్తకుండా డాబా మీదికి పోయి కళ్ళ నీళ్ళు పెట్టుకుంది. ఆఫీసు నుంచి వచ్చి సంగతి తెలిసిన శేఖరం అటు తల్లినేమీ అనలేక, ఇటు భార్య నోదార్చటం తెలియక మవునమే శరణ్యం అనుకుని భోజనా లయి పడక గది చేరే వరకూ నోరు తెరవ లేదు. ఆ తరవాత అతను నొచ్చుకుంటూ విని "క్షమించు" లాంటి పదా ల్లేకుండానే అనునయించడం, కళ్ళు చెమ్మగిల్లించు కోవడం దేవి ఈ జన్మలో మరిచి పోలేదు. అదృష్టం బాగుండి శేఖరానికి ఆ ఊరు నుండి బదిలీ కావడంతో కొత్త దంపతులు కటువంటి సమస్య మరెదురవలేదు.



తాజా వార్తలకు
ఆంధ్రప్రభ - దిన పత్రిక
చదవండి

భారత దేశంలోనూ,
యింకా యిరవై యితర
దేశాలలోనూ నాణ్యతపైన
దృష్టిగల నిర్మాతలు
ఎంచుకునే మొట్టమొదటిది—
FIE టెస్టింగ్ మిషన్లు



- యూనివర్సల్ టెస్టింగ్ మిషన్లు
- డైనమిక్ బాలన్సింగ్ మిషన్లు
- హార్డ్‌నెస్ టెస్టర్లు (బ్రినెల్ & రాక్‌వెల్)
- పెండ్యులమ్ ఇంపాక్ట్ టెస్టర్లు (మెటల్స్ & ప్లాస్టిక్స్ కోసం)
- కంప్రెషన్ టెస్టింగ్ మిషన్లు
- ఎర్‌కాన్ షీట్ మెటల్ టెస్టర్లు
- స్ప్రింగ్ టెస్టింగ్ మిషన్లు

వస్తునాణ్యతను పెంపొందించుకోండి.
బ్లూ స్టార్, ది హౌస్ ఆఫ్ టెస్టింగ్ మెషిన్స్. దగ్గరకు రండి.
క్వాలిటీ కంట్రోల్ యంత్రాలలో ప్రత్యేకత గలవారు.

Quality products from
BLUE STAR ©
బొంబాయి • కొత్త ఢిల్లీ • కలకత్తా • మద్రాసు
అహమ్మదాబాదు • పుణె • కాన్పూరు • జమ్‌షెడ్‌పూర్
బెంగుళూరు • కొచ్చిన్ • సికింద్రాబాదు • విశాఖపట్టణం.
Specialists in quality control equipment
U-BS-TM-8/8 TE

పోస్టుమాన్ కేకతో గతంలోంచి ప్రస్తుతం లోకి వచ్చి వెళ్ళి ఉత్తరా లందుకుంది. చాలా రోజుల తరవాత రాసింది శైలజ. చిన్నప్పటి నుంచి ఇద్దరూ ప్రాణ స్నేహితులు.

"దేవీ!

ఈ మధ్య మూడు నెలల నుంచి ఉత్తరం వ్రాయ డం పడనందుకు మరోలా భావించకు. నాలుగు రోజులు నీ లాంటి ఆత్మీయులతో, చిన్ననాటి నుంచి చనువున్న వాళ్ళతో గడపాలని ఉంది. ఈ ఉత్తరాన్ని టెలిగ్రామ్‌గా భావించి వెంటనే బయలు దేరు. బావగారు నీ ఎడబాటు సహించ లేరని తెలుసు. కాని నా స్వార్థంతో బావగారికి శ్రమ ఇవ్వక తప్పదు. బావగారికి నానమస్కారాని చెబుతూ ఆయన్ని ఒప్పించి వచ్చే బాధ్యత నీకే వదిలి వేస్తు న్నాను.

నీ శైలు."

ఉత్తరం చదివి వినిపించింది దేవి. ఉత్తరం లోని సంగతులు విన్న శేఖరానికి శైలజ, ఆమె భర్త గుర్తు కొచ్చారు. పెళ్ళయిన తరవాత ఒకటి రెండు సార్లు వాళ్ళింటికె వెళ్ళారు. దేవికి తల్లి దండ్రుల తరవాత అత్యంత అభిమానులు, సన్నిహితులువాళ్ళేనా అనిపించింది. అంతగా అతుక్కు పోతారు వాళ్ళిద్దరూ. అత్తగారిని జడిపించి పంపించేయ గలిగాడుకాని, వీరి స్నేహం తెలిసిన తరవాత దేవిని శైలజ దగ్గరకు వెళ్ళ వద్దని చెప్పలేడు. అదీకాక నాలుగు రోజులేగా—

అయిదో రోజు కలిగే ఆనంద వెల్లువలను తలుచు కుంటూ ఆ నాలుగు రోజుల్ని సులభంగా గడిపేయ వచ్చు.

ఆలోచనలో పడిన శేఖరాన్ని చూసిన దేవి ముఖంలో అనుమానం తొంగి చూసింది. మరిచి పోయిం దనుకున్న నిన్నటి రభస ఆమెకు మళ్ళీ గుర్తొచ్చింది. అడిగి కాదనిపించుకునే బదులు అతను చెప్పే వరకూ వేచి ఉండటమే మంచి దనుకుంది, అతనిముఖం లోనిమార్పుల్ని గమనిస్తూ.

ఇటువంటి అతి సునితమైన మనసు, భార్యంటే పిచ్చి ప్రేమ ఉన్న భర్త వరమో శాపమో బోధ పడలేదు దేవికి. శైలజ భర్త గుర్తు కొచ్చాడు ఆమెకి. వాళ్ళది ప్రేమ వివాహం, కులాంతరం కాదు కాబట్టి పెద్దల ఆమోదానికి ఆశీస్సులకు లోపం లేదు. వాళ్ళ పెళ్ళయిన కొత్తలో అతని గురించి శైలజ చెప్పిన మాటలు గుర్తు కొచ్చాయి—

"ఒసే దేవి! ఆయనలో నాకు ఏ దోషం కనపడదు కాని కొని భావాలు మాత్రం పాత చింతకాయ పచ్చడే. అయినా ఎస్సెల్సీలో చదువాపేసిన మొద్దువి— నీకు బోధ పడదేమో. ఆయన దృష్టిలో ఎంతో అవసరం ఉంటేనే కాని ఆడవాళ్ళు ఉద్యోగం చేయ కూడదు. ఉద్యోగానికి వెళ్ళి మగాళ్ళతో పాటు ఆ రాటుపోట్లను ఎదుర్కొంటే వాళ్ళలో సౌకుమార్యం ఆప్యాయత, చివరకు స్త్రీత్వం కొరడవతా యన్నది ఆయన దృఢాభిప్రాయం. ఏ రోజు కేం జరిగి ఇంటి ఆడది ఉద్యోగానికి వెళ్ళే అవసరం ఎప్పుడొస్తుందో ఎవరు చెప్పగల రంటే వితండ వాదనకు దిగుతారు . . ." అలా ఆవేశంగా మాటాడుతూ ఉంటే శైలజ చూడ ముచ్చటగా ఉంటుంది. అది తలుచు కున్న దేవికి అనుకోకుండానే నవ్వొచ్చింది.

"అవునులే. పిల్లికి చెలగాటం, ఎలుక్కి ప్రాణ సంకటం. నువ్వు లేకుండా ఎలాగా అని నేను ఆలోచించ లేక చస్తూంటే" అన్నాడు శేఖరం ఉడుకుమోత్తనంగా.

"ఏంటండీ. ఏదో గుర్తొచ్చి నవ్వులే మీ చిరాకు. ఎంత సేపు 'నిన్నొదిలి ఉండ లేను, ఉండ లేను' అంటారే కాని మిమ్మల్నొదిలి ఉండడం నా కేం సరదానా? దానికి రాసేస్తాను. చంటి వాణ్ణి తీసుకు రావడం ఎలాగూ తప్పదు. మా ఆయన అటు చంటి పాప కాదు, ఇటు పెరిగిన మనిషీ కాదు, ఆయన న న్నొదల నంటున్నారు, నేను రావడం పడదని."

"అంటే న న్నే చంటి వెధవ కింద జమ కట్టా వన్నమాట. అవునులే మగాడు ఎప్పుడూ చంటి వెధవే. పుట్టినప్పుడు తల్లి ఒడి, పెళ్ళయిన తరవాత భార్య గుండెల మీద. వార్ధక్యంలో కొడుకు భుజాల నానుకుని—బతుకంతా మగాడి కిలా గడవాలి సిందే." శేఖరం ఉడుకుమోత్తనం అవధుల్ని చేరు కుంది.

"ఆహా. శాస్త్రాలనే తిరిగి వ్రాస్తున్నారు. మీ రన్నవన్నీ స్త్రీకి వర్తిస్తాయి." పుస్తకా లెక్కువ చదవక పోయినా ఇల్లనే పాటశాలలో పెద వాళ్ళ మధ్య తర్ఫీదు పొందిన దేవి చాలా నిబ్బరంగా ఆరిందాలా అంది.

"అంతా కలియుగ మహాత్మ్యంలే. వీలైనంత త్వరగా తిరిగి వచ్చెయ్యాలి. అక్కడ స్నేహితురాలితో ముచ్చట్లో పడి నన్ను. . ."

"చాల్లెండి. ఎంత సేపూ మీ స్వార్ధమే కాని ఎంత అవసరం లేకపోతే అది రమ్మంటుంది? వేరే ఆడ దిక్కు లేని సంసారం వాళ్ళది. అవసరానికి ఆదుకో లేకపోతే స్నేహితులని అనుకోవడం ఎందుకండీ. . ."

"దేవీ? ఆపు నీ ఉపన్యాసం. ఆకలవుతోంది—భోజనం చేసి నిన్ను బస్సెక్కించి నేను ఆఫీసుకు పోవాలి" అన్నాడు, ఆఫీసుకు ఆలస్యంగా వెళ్ళడం అలవాటు లేని శేఖరం.

### 3


బస్సు స్టాండుకు శైలజ భర్త వచ్చి దేవిని రిసీవ్ చేసుకున్నాడు. ఆమెను రిక్షా ఎక్కించి వెనక సైకిల్ మీద అతను ఫాలో అయాడు.

స్నేహితురాల్ని చూసిన శైలజకు ప్రాణం లేచి వచ్చింది. గత నెలరోజుల నుంచి ఆమె లోలోనే పడుతున్న బాధంతా ఎవరో చేత్తో తీసేసినట్లు అయింది. ఆప్యాయంగా ఆహ్వానించి లోపలికి తీసుకు వెళ్ళి దేవే తన సర్వస్వం అనిపించేట్లు చేసింది. స్నేహితురాళ్ళ నేకం చేసి తన బాధ్యత అయిపోయిం దన్నట్లుగా నారాయణ వీధిలో కెళ్ళాడు.

రాత్రి శైలజ, దేవి మాటలు ముగిసేసరికి రాత్రి పది గంటలయింది. "ఇక పడుకోవే. రేపటినుంచి మూడు రోజులు నీకు చాలా టైట్ ప్రోగ్రామ్ ఉంది" అంది.

మరునాడు పొద్దున్న కాఫీ కప్పు భర్తకి పడక గది లోనే అందించి వస్తున్న శైలజతో —

"ఏమిటే. ఇదెక్కడి చోద్యమే. పక్క మీంచి లేవకుండానే భర్తకు కాఫీ అందింపులా. నేను పని





రహస్యం చిత్రం — ఆగాచార్య ( మునకొండూరు )

మనిషి కంట్లో వేసి ఇల్లు సర్దేసరికి మా ఆయన కాలకృత్యాలు తీర్చుకుని నేను వేసిన ఫిల్టరు లోంచి డికాక్షన్ తీసి కాఫీ చేసి ఇద్దరికీ రెండు కప్పులలో పోసి నా కందిస్తారు" అంది శ్రీదేవి — శైలజ భర్త నారాయణకు వినిపించ దేమో అన్నట్లు గొంతు పెంచి మరీ.

"అది నీ అదృష్టం. ఇది నా ఆనందం. ఆయన చేత పని చేయించడం నా కిష్టం ఉండదు. మన మున్నది మగాళ్ళ సేవ చేయడం కోసమే కదా" అంది శైలజ.

కొంత సేపు అయిన తరవాత. . .

"ఏమే. చాకిరేవు పెట్టావ్. చాకలికి బట్ట లెయ్యరా మీ ఇంట్లో. అన్ని పాంట్లు, షర్టులు నువ్వే ఉతుకుతావా ఎప్పుడూ?" బాత్ రూమ్‌లో బట్టలతో సతమత మవుతున్న శైలజను చూస్తూ గట్టిగా అంది.

"ఈ పట్నంలో చాకలికి ఎప్పుడూ బట్ట లేస్తే ఇల్లు గడవడం కష్టమే తల్లీ! మా ఆయన జీతంతో సంసారం గడుపుకు రావాలంటే పొదుపుగా ఉండక తప్పదే" అంది శైలజ.

"ఏమిటే నీ పొదుపు ఏదో సామెత చెప్పినట్లు మీ ఆయన సిగరెట్లు తగలేసే దాంట్లో నాలుగో వంతు పెడితే స్టీమ్ లాండ్రీకే వెయ్యొచ్చు మీ అందరి బట్టలు" అంది దేవి, పేపరు చదువు కుంటూ హాలులో కూర్చున్న నారాయణను ఓరకంట చూస్తూ. పొద్దున్న నించి రెండు గంటల్లో ఒక పాకెట్టు సిగరెట్టు వూదేసి రెండో పాకెట్టు మూచ్చి కాగితం చింపుతున్న అతను కొంత సేపు పేపరు పక్కన పెట్టి ఏదో ఆలోచనలో పడ్డాడు.

"ఒసే దేవీ! నే నీ వీధి చివర కూరల షాపుకు వెళ్ళి వస్తాను. స్టౌ మీద పాలు రెండు పొంగు లొచ్చిన తరవాత దించేసి స్టౌ ఆర్పేయవే" అంది శైలజ.

పేపరు లోంచి బుర్ర తీసిన నారాయణ—"ఎందుకు శైలూ! నే వెళతా, ఆ కూరల సంచీ ఇలా పడేయ్" అన్నాడు లేచి నిలబడుతూ.

"మీ రుండండి మరిదిగారూ! కూరలు కొండం మగాళ్ళ కేం తెలుస్తుంది. ఇంట్లో సరుకులూ కూర గాయలు అన్నీ నేనే తెచ్చుకుంటాను. మీ అన్నయ్య గారికి వంకాయల్లో పుచ్చులు చూడడం చెప్ప ప్రయత్నించి చిరాకు పుట్టి ఆ ప్రయత్నం మాను కొన్నాను" అంది దేవి.

"నువ్వెళ్ళి రావే. పాలు పొంగకుండా నేను చూస్తానులే" అంది శైలజ వైపు తిరిగి.

శైలజ గుమ్మం దిగడ మేంటి, నారాయణ వాలు కుర్చీకి దగ్గరగా గార్డెన్ చెయిర్ లాక్కుని కూర్చుంది.

"ఏమండీ! శైలు అదృష్టవంతురాలు, మీ సేవ పూర్తిగా చేసుకోగలుగుతూంది. ఏం కర్మో. మా ఆయన ఆ వంట పని తప్ప ఇంకేది నన్ను ముట్టుకో నివ్వరు" అంది.

నారాయణలో కంగారు గమనించింది.

"నా. . . నాకూ ఇంటి పనిలో సాయం చెయ్యా లనే ఉంటుందండి. కానీ అది చెయ్య నివ్వదు. పైగా నాకు చేత కాదని ఎగతాళి చేస్తుంది" అన్నాడు వీధి వైపు చూస్తూ.

"అది చిన్నప్పట్నించి అంతేనండీ. వాళ్ళ అమ్మ 'చదువుతో పాటు ఈ పంటలు ఎక్కడ పడతా' యంటే వింటే కదా. ఒట్టి మొండిది. అందుకే దాని చేతులు అలా కాయలు కాసిపోయాయి. బుర్ర పదునెంతో చేతులు మోటుతనం అంతే" అని అతని ముఖం కేసి సూటిగా చూస్తూ అంది.

"అబ్బే. మీరు. . . అవునండీ మీరు చెప్పింది నిజమే. ఆడది అన్ని పనులూ చేసి పెడితే సరా, చేతుల్లో సున్నితత్వం, మాటల్లో మృదుత్వం, నడవడిలో స్త్రీత్వం. . ."

"ఆపండాపండి. మీ తత్వాల జాబితా కేం కాని అది వచ్చేస్తూంది."

ఆ సాయంత్రం ముగ్గురూ కలసి సినిమా కెళ్ళారు. బాగా వెనక రోలో కూర్చున్నారు. ఇంట్రవెల్‌లో "శైలూ! మన ముందు రోలో చివర కూర్చున్నాడు, చూశావా. అతను ఎంతో అందంగా ఉన్నాడు కదండీ." సిన్సియర్‌గా చిత్రకళా ప్రదర్శనలో ఒకచిత్రం గురించి అడిగినంత సహజంగా

అడిగింది.

నారాయణ కనుబొమలు పైకి లేచాయి. శైలజ చిన్నగా నవ్వి తల వంచుకుంది.

మరునాడు ఆదివారం. నారాయణ కేరమ్స్ ఆడదా మంటే బోర్డు పరిచారు. వేసవి సెలవులకి పిల్లలు వాళ్ళ తాత గారింటికి వెళ్ళిన తరవాత నెల రోజుల నుంచి ఆ బోర్డు వైపు చూసే వాళ్ళే లేకుండా పోయారు.

"మీ రిద్దరూ ఆడండి. నేను చూస్తూ ఉంటాను" అంది శైలజ.

ఆడుతూనే సంభాషణ సాగిస్తోంది దేవి.. మాటల్లో శేఖరం ఆఫీసు గొడవలు వాటిని అతను కలు కథలుగా చెప్పేతీరూ ఏకరువు పెడుతూంది. పబ్బం గడుపుకుందికి తియ్యగా మాట్లాడి సహాయం చేసిన వాళ్ళకే గోతులు తవ్వే తత్వాలున్న మనుషులు, ఎదుటి వారి మంచితనాన్ని తమ స్వార్థాన్ని కుపయోగించుకొని తిరిగి వాళ్ళనే ఎగతాళిచేసే గడుసు వాళ్ళే, మంచి చేసి పైకి చెప్పని ఉత్తములు. . .

"నా కింక ఆడాలని లేదు శైలా. మీ రిద్దరూ ఆడండి. నేను నిన్న సగంలో ఆపేసిన నవల పూర్తి చేస్తాను" అని చెప్పి నారాయణ తన గదికి వెళ్ళి పోయాడు.

ఇద్దరు స్నేహితురాళ్ళు ఒకర్నొకరు చూసుకుని నవ్వుకుంటూ పిక్కలు డబ్బాలో వడేసి బోరు ఎత్తేసి అప్పడాల పిండి, రెండు పీటలు ముందేసుకుని అప్పడా లొత్తడాని కుపక్రమించారు.

## 4

"శైలా! ఒక ఫ్రెండ్‌కి ప్రమోషన్ వొస్తే పార్టీ ఇస్తున్నాడు. నేను వచ్చేసరికిలేటవుతుంది. మీరు నా కోసం చూడకుండా భోజనం చేసేయండి" అని చెప్పి నారాయణ వీధిలోకి వెళిపోయాడు.

స్నేహితురాళ్ళు వూర్లో ఉన్న ఏకైక మ్యునిసిపల్ పార్కుకి వెళ్ళి కొంత సేపు గడిపారు.

"ఒసే శైలా! నా కన్న ఎక్కువ చదువుకున్న దానివి. దేవుడి లాంటి భర్త ఉంటే అంతకన్న స్త్రీకి కావలసింది ఇంకేం లేదని వింటూ ఉంటాం అది నిజమే కదే" శేఖరం గుర్తుకు వస్తూంటే అంది

"వెర్రిదానా! శుద్ధ నలుపు, తెలుపులు అరుదైనట్టే బలహీనతలకి ఏదో థ్రిల్ కోసం పరుగులకి లోబడని మనుషులకూడా అరుదే. కొన్ని యుగాల నుంచి స్త్రీని ఎన్నో అంక్షలతో— మంచినడవడి నియమాలతో నొక్కి పెట్టి ఉంచారు కాబట్టే బలహీనతలకు ఎక్కువగా మగవాడే వారసు డన్న భావం స్థిరపడింది. ముఖ్యంగా మన లాంటి మధ్య తరగతి స్త్రీల మనస్సుల్లో. ఎగుడు దిగుడు ల్లేని బాటలు లేనట్లే, సాఫీగా నడిచి పోయే జీవితాలుకూడా కోటి కొకటి. అలాంటి జీవితం ఆశించడం కోరి కష్టాలు. కొని తెచ్చుకోవడమే. అటువంటి ఆశ అజ్ఞానానికి చిహ్నం. మన ధర్మ శాస్త్రాలు అందుకే కష్ట సుఖాల్ని, మంచి చెడులను సమ దృష్టితో చూడటం అలవరుచుకో మని బోధిస్తున్నాయి. మానవ స్వభావం స్వచ్ఛమైన మంచికి కాని, మంచి లేని చెడుకు కాని ఆలవాలం కాదు. ఇది తెలుసుకు మనసులో జీర్ణించుకుంటే ఏ కష్ట మెదురైనా ఎంత దుష్టత్వం ఎదురు తిరిగినా మనిషి తట్టుకుని నిలబడ కలిగే ధైర్యాన్ని కలిగి ఉండడం సాధ్యమవు తుంది."

అలా ఎంత సేపు మాట్లాడిందో శైలజ. మంచి విద్యార్థిలా వింటూ కూర్చుంది దేవి. రేడియోలో సమయం ఏడు గంట లయిందని వినిపించి వెంటనే ఇంటి కొచ్చేశారు.

ఎవ రాలోచనల్లో వాళ్ళుండి వంట పూర్తి చేసి ఇద్దరూ భోజనం చేశారు. హాలులో కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నారు. రాత్రి తొమ్మి దయిం తరవాత పడుకుందామని లేవబోతూ ఉంటే వీధి తలుపు తట్టిన శబ్ద మయి శైలజ వెళ్ళి తలుపులు తెరిచింది. తూలుతూ వచ్చాడు నారాయణ. తిన్నగా పడగ్గదిలోకి వెళ్ళి పోయాడు. దేవి వంక అర్థ వంతంగా చూస్తూ శైలజ అతని వెంట వెళ్ళింది.

మరునాడు బస్సులో ప్రయాణ మవుతున్న దేవికి చీర, జాకెట్టు పసుపు కుంకుమ పెట్టింది శైలజ.

"మీ రున్నది తక్కువ రోజులే అయినా భర్త ఎలా ఉండాలో చెప్పకుండానే చెప్పి నాకూ శైలజకు ఎంతో సాయం చేశారు."

"చాల్లెండి. ఓట్ ఆఫ్ థాంక్సు చెప్పడానికి మీ ఆఫీసులో మీటింగ్ కాదిది. ఒట్టి సత్తెకాలపు మనిషి. దాని కేం తెలుసు మీకు చెప్పడానికి" అంది శైలజ దేవి పొడుగాటి జడకు చివర రిబ్బను ముడి వేస్తూ.

మంతనం చిత్రం—అగాచార్య (ముకొండూరు)




## 5

"ఏమండీ! నా చేత ఏవేవో మాట్లాడించి శైలజ భర్తని మంచి మార్గంలో పెట్టడానికి ప్రయత్నం చేసిందండి. నేను చేసిన మంచేమిటో నాకు బోధ పడలేదు కాని అది అంటే బౌననుకున్నాను. అది సరే కాని, ఏమండీ! వాళ్ళయన తాగింటి కొస్తే చీమ కుట్టినట్టయినా అవలే దేమండి దానికి. అతని వెంటే చాలా మామూలుగా నడిచి వెళ్ళిపోయింది" అంది దేవి భర్తతో.

"వెళ్ళి అక్కడ ఉన్న దానివి నువ్వు. నన్నడిగితే నా కేం తెలుస్తుంది. అయినా మీ స్నేహితురాలి కాపరం గురించి ఎందుకులే కాని విశేషాలు చెప్పవే" అన్నాడు శేఖరం.

"దాని కాపరం గురించి కాక విశేషాలే మున్నా యండీ. శైలజ భర్త అనుమానిస్తాడు, భయస్తు డంట. వీటన్నిటినీ మించి బద్ధకిస్తుడట. నాచేత ఏవేవో వాగించింది. అవన్నీ మాట్లాడానికి నా కెంత కష్టమయిందో. పోనీలే నా శైలాకి మంచి జరుగు తుంది కదాని నటించేశాను." ఆ చివర మాట అంటున్నప్పుడు దేవి గొంతులో కొంత గర్వం తొణికిస లాడింది.

"ఇన్ని కబుర్లు చెప్పావు. ఇప్పుడు చెబుతున్నావ్. మరి నే నొక రోజు తాగి వచ్చేసరికి, అదే తాగినట్టు నటించేసరికి అంత కంగారై పోయావు, ఏదో కొంప మునిగి పోయినట్టు. శైలజ భార్యను బాగు చేయ డానికి తోడ్పడ్డా నన్న గర్వమే కాదు, నీ మనస్తత్వంలో కూడా మార్పు రావాలి. . ."

పోస్టుమాన్ కేక వినడంతో శేఖరం ఉపన్యాసానికి అడ్డు పడింది.

"ఏమండీ! శైలే రాసిందండి. అప్పుడే ఎలా వచ్చిందండి. నేను బయలు దేరింది నిన్న రాత్రే కదా."

"సరేలే. స్పెషల్ డెలివరీ అయుంటుందిలే చదువు. వింటాను."

"ప్రియమైన దేవి,

నేను చెప్పినట్టు చేసి నాటకం బాగానే రక్తి కట్టించావు. ఆయనలో మార్పు వస్తుం దనే అనుకుంటాను. కొందరు మగాళ్ళకి పెళ్ళాల చెప్పిన కంటే పరాయి ఆడది చెబితేనే బుర్ర కెక్కు తుంది. కాని మనం ఆటిన నాటకంలో నీకు చెప్ప కుండా ఉంచిన విషయంకూడా ఉందే. మీ ఆయనకి కూడా ఇందులో భాగముంది. అసలు ఇదంతా జరిగింది అతని ప్రోద్బలం మీదే. కాలంతో పాటు మనమూ మారకపోతే మన జీవితాల్నే కాకుండా మనం అభిమానించే వారి జీవితాలుకూడా నరకం చేసిన వాళ్ళ మవుతాం. ఈ రోజుల్లో వీధిలో కెళ్ళే మగాడు మడి కట్టుకుని. . ."

ఇంకా ఉత్తరం చదివి తెలుసుకోవలసినంత తెలివి తక్కువది కాదు దేవి. ఉత్తరం పక్కన పడేసి భర్త గుండెల మీద వాలిపోయింది. రేడియోలో సంగీత శిక్షణ కార్యక్రమం అపుడే ముగిసింది.

*